# అక్క కోరిక

తెలతెలవారుతుంటే నిద్రమేలుకొన్న ప్రసూన ముఖం కడుక్కుని పక్షుల కలకూజితాలకు మైమరిచి పెరట్లో అలానే నిలబడిపోయింది. మనస్సుకి హాయినిచ్చే సూర్యోదయాన్ని తిలకిస్తూ అలాకాసేపు తనని తను మరచిపోవటం అలవాటే ప్రసూనకు. ఊరికే అలా నిలుచుని ఏం చేస్తున్నావ్ !! అంటుండేది అమ్మ! పొద్దున్నే ఇలాంటి వాతావరణంలో ప్రశాంతంగా ప్రకృతిలో లీనమైపోవటం ఆరోగ్యానికి ఎంత మంచిదో నీకు తెలుసా ? తన ప్రమేయం లేకుండానే ఎదురు ప్రశ్న వేసేవాడు నాన్న. అమ్మా, నాన్నల ప్రేమామృతపు జల్లుల్లో ఎంత అపురూపంగా పెరిగింది తను, ఆరోజులేవేరు.

తల్లితండ్రులు తలపుల్లో మెదిలేసరికి, కళ్ళల్లో నీళ్లు తిరిగాయి ప్రసూనకి. తను ఎంతో సుఖపడుతుందని తనని ఈ ఇంటి కోడలిగా చేసారు. వాళ్ళ అంచనా పూర్తిగా తారుమారు కాకపోయినా భర్త ప్రవర్తన తనను కష్టపెడుతూనే ఉంది. మీ అమ్మాయికి ఏ లోటూ రానివ్వను, పువ్వుల్లో పెట్టి చూసుకోనూ అంటూ అల్లుడుగా ఆరోజు అమ్మ నాన్నల్ని మురిపించాడు. ఏమో బాబూ అంతా నీ మంచితనం మీదే ఆధారపడి ఉంది. నిజానికి నీ స్థాయికి తగిన రీతిలో కట్నకానుకలు ఇవ్వలేకపోయాం అని అమ్మంటే, "ఒక్కసారిగా అయితే సమకూర్చలేపోయాను కానీ మీ ముద్దు ముచ్చట్లు తీర్చకుండా ఉంటామా" అంటున్న నాన్నగారి కంఠంలో రవ్వంత అవేదన చోటు చేసుకుంది "మీరింతగా చెప్పాల. నేనేమడిగానని. ఇప్పటికి ఈ పుత్తడి బొమ్మతో సరిపెట్టు కుంటానులెండి." తనని కొంటెగా చూస్తూ అమ్మ, నాన్నల మనస్సులు తేలికపరిచాడు. ఆక్షణం తనూ మురిసిపోయింది. ఆరునెలలు శ్రీవారితో ఆనందలోకాల్లో తేలిపోయింది.

ఆరోజు తను తొందరగా పని తెమిల్చేసుకుని హాట్‌పాక్‌లో టిఫిన్, ఫ్లాస్కులో కాఫీ రెడీ చేసి అతనికి ఇష్టమైన నేరేడుపండురంగు చీరకట్టుకుని విరజాజులు మాల అల్లుకుంటూ ఎదురు చూస్తోంది. వచ్చేరంటే ఒక్క క్షణం నిలువనీయరు. ఈరోజు సినిమా ప్రోగ్రామ్ వేసారు కూడా తన

ఆలస్యం ఏ మాత్రం ఉన్నా హడావిడి పెట్టేస్తారు. మనస్సుకి గిలిగింతలు పెట్టే చిలిపితనం శ్రీవారిది. తనలోని, ప్రణయ భావాల్లానే పరిమళిస్తున్నాయి విరజాజులు.

"ప్రసూనా ఏమిటా పరధ్యానం, ఇంట్లో దొంగలు పడ్డా ఇంతే అన్నమాట", భర్త మాటకు ఉలిక్కిపడింది, " నేనిక్కడే కూర్చున్నాగా, అయినా మనసు దోచుకొన్న దొంగ తప్ప ఈ ఇంట్లో ఎవరూ చొరబడరు శ్రీవారు." "ఈ తీపి కబుర్లకే? ఎన్నైనా చెప్పచ్చు. నిజమే నువ్వన్నట్లు దొంగలెత్తుకెళ్ళటానికి మనింట్లో ఏమున్నాయిలే" విసుగుగా లోపలికి వెళ్ళబోతున్న అతని పాదాల కిందపడి తనల్లుకుంటున్న విరజాజిమాల నలిగిపోయింది.

అదిమొదలు శ్రీవారిలో శాంత స్వభావానికి బదులు కోపం, చిలిపితనం స్థానంలో చిర్రుబుర్రులు ప్రారంభం అయ్యాయి. ఖరీదైన వస్తువులేవి తన పుట్టింటి నుండి తీసుకురాలేదని కనీసం ఒక లక్షైనా ముట్ట చెప్పలేదనీ భర్త ధోరణిలో ఈ మార్పు. తొలిరోజుల్లో ఈ మోస్తరు ఆలోచనలేవి అతనికి లేవు. అందుకనే మొగ్గలోనే తుంచేయాలి అని ప్రయత్నించక పోలేదు ప్రసూన.

"మీరు మనసులో ఏదో పెట్టుకుని మదనపడటం దేనికి సూటిగా చెప్పేయండి" అంది.

"నీతో చెప్పేం లాభం జెష్ఠ మొహనివె," చదువుతున్న పేపర్ తన ముఖాన్నా గిరాటేసాడు.

"లాభనష్టాలేమిటి. భార్యభర్తల మధ్య దాపరికాలు ఉండచ్చా చెప్పండి ప్లీజ్" దగ్గరగా వెళ్ళింది.

"ఏమిటే ఏం చెప్పేది ఈ ఇంట్లో ఒక్కటంటే ఒక వస్తు ఉందా. ఏడాది కావస్తున్నా పుట్టింటి నుంచి ఏమీ తెచ్చుకోలేని దద్దమ్మవి. సోఫాసెట్, కలర్ టి.వి, ఫ్రిజ్ ఇలా నెలకొకటి చొప్పున అమర్చి వలసిన మాట!"

కావాలనే పెదవులపైకి చిరునవ్వు తెచ్చుకుని, అంది. ఈ మాత్రానికేనా వాయిదాల పద్ధతి మీద కొనేసుకుందాం. మా వాళ్ళే ఇవ్వాలని ఎక్కడుంది.

ఎక్కడా!? ప్రతి మగాడి బ్రతుకులోనూ ఉంది కాపురానికి వస్తూనే ఇలాంటి వాటన్నీటితో భార్య అడుగుపెట్టాలి.

ఆ స్థాయి మాకు లేదని తెలిసేగా నన్ను కోరిచేసుకున్నారు.

నన్ను మభ్యపెట్టాలని చూస్తావేం. ఒక్కసారిగా ఇవ్వలేకపోతున్నాను కాని అన్నీ సమ కూర్చిపెడుతానని అనలేదూ మీ నాన్న? పైగా మొసలి కన్నీళ్లు కార్చారు. ఆ మాట ప్రసూన మనసు పిండేసింది.

నిష్కల్మష హృదయుడైన నాన్ననా ఈ మాట అంటున్నది. తన పెళ్ళికైన అప్పే తీర్చ లేకపోయాడు. నాన్నకే స్థోమత ఉంటే అడగకుండానే అన్ని ముచ్చట్లు తీర్చేవాడు.



2063

ఏం నోరుమూత పడిపోయింది. అయినా నాకు నీ కల్లబొల్లి మాటలతో పనిలేదు. ఓ లక్ష పడేయమను మనక్కావలసినవన్నీ కొనుక్కుందాం. మీ నాన్నకి దయ, కలిగినప్పుడు ఏదో కటాక్షిస్తాడని ఆశపడుతూ కూర్చోలేను.

మీరు చెప్పేది మరీ బాగుంది. మనకు కావలసిన వస్తువులు మనం అమర్చుకోవాలి. మనకాళ్ళ మీద మనం నిలబడి ఇంటిని చక్కదిద్దుకున్నప్పుడు కలిగే తృప్తి కట్నకానుకల రూపంలో రాబట్టడంలో ఉంటుందా? (నాలుగు రోజులుగా అయితే నరకాన్నే చూపిస్తున్నాడు). మొండి ఘటానివి ఎంత చెప్పినా చెవికెక్కదు ఇక నీతో లాభం లేదు. నువ్వు నాతో కళకళలాడుతూ కాపురం చెయ్యాలి అనుకుంటే ముందు మనిల్లు కళకళలాడాలి. ఉన్నపాటున ఉత్తరం రాసిపడై, వెంటనే మీ నాన్న లక్షణంగా లక్షా పట్టుకుని ప్రత్యక్ష మవకపోడు. కూతురు సుఖం కోసం అప్పో, సొప్పో చెయ్యడూ? నువ్వు కావాలనే ఊరుకుంటున్నావు అంటూ తన పైకి ఓ కవరు విసిరాడు.

తొలి మూడు రాత్రులు ఎంత కమ్మని అనుభూతులు గుండెలో నింపాయో గుర్తుకి రావటం లేదు కానీ, ఈ మూడు రాత్రులు తన పాలిటి కాళరాత్రుల్లా గడిచాయి. డబ్బు పిశాచం ఈ మహానుబావుణ్ణి ఎంతగా పట్టుకుంది? ఆలుమగల అనుబంధం దీనితోనే ముడిపడిఉందా? అబ్బాయైనా, అమ్మాయైనా తల్లితండ్రులు ఒకేలా కనిపెంచుతారు ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి విద్యాబుద్ధులు చెప్పిస్తారు. అలాంటప్పుడు ఆడపిల్ల నుంచి వరకట్నం ఆసించడం అమానుషం కాదా? ఆలోచిస్తునే వంటింట్లోకి నడిచింది. కాఫీ కలుపుతుంటే చెంప చెళ్ళు మనిపించాడు ప్రవీణ్. "వీడేం చెయ్యగలడు అనుకుంటున్నావా? కవర్ అలా టేబుల్ పైనే ఉంచావు. బట్టలు సర్దుకో మీ ఊరికి బస్సెక్కించేస్తాను. అన్ని సామాన్లతోనే నువ్వు అడుగుపెట్టేది. భర్త ధోరణి మార్చాలని కాని, అతనికి నచ్చచెప్పాలని కానీ ప్రయత్నించలేదు. గతమూడు రాత్రులు ఘోరమైన మాటలు అంటుంటే భరించింది. చై వాటు తనన్నీ అనుభవించింది. తాళి కట్టిన భర్త కదూ. అతని చేతిలో తను మరబొమ్మ, అతను చెప్పినట్లు చెయ్యవలసిందే, మనస్సును చంపేసుకుని మరమనిషిగా మారుతూ " సరే లెండి ముందు కాఫీ తాగండి." గ్లాస్ చేతికిచ్చింది. "అన్నట్టు నేను తొందరగా ఆఫీసుకి వెళ్ళాలి నాకోసం వంట చేసి తగలేయకు నేను మధ్యాహ్నం వచ్చేస్తాను. నాలుగు గంటల బస్సుకి నువ్వు మీ ఊరు వెళ్తున్నావ్. వచ్చేసరికి రెడీగా ఉండకపోయావో?" కళ్ళెర్ర చేసాడు.

"పదేపదే చెప్పనక్కరలేదు. మగ మహారాజులు కదూ మీరేం చేసినా చెల్లుతుంది."

"వెరీగుడ్ ఇప్పటికి అర్థం అయ్యిందన్న మాట. వెళ్లొస్తాను." వెళుతున్న భర్తను అలానే చూస్తూ చిత్తరువులా ఉండిపోయింది.

"ఇప్పటికి దారికొచ్చింది తన పంతమే తనది అన్నట్లు ఎంత మొరాయించింది! ఏదో ప్రేమా, ప్రణయం అంటూ, తనిన్నాళ్ళూ ఇవేవీ పట్టించుకోలేదు. తోటి వాళ్ళంతా అల్లుళ్ళుగా ఎంత దర్జా, దర్పం ప్రదర్శిస్తున్నారు! ఇంక తనూ అలానే ఉండొచ్చు." హుషారైన ఊహలతో

ఆఫీసుకు చేరుకున్నాడు. ప్రవీణ్‌ని చూస్తూనే సహోద్యోగులు కొంతమంది చుట్టుముట్టి "ఇవాళ మన ప్రసాద్ బ్రహ్మాండమైన పార్టీ ఇస్తున్నాడోయ్! మనం కాంటీన్ మొహంచూడకుండానే ఇటునించటు..." అంటూ హడావిడి చేశారు. ప్రసాద్ ఘనవిజయం సాధించినట్లు అందరి వైపు గర్వంగా చూస్తున్నాడు. అంత గొప్ప పార్టీ ఇవ్వడానికి కారణం ఏమిటో అనుకోలేదు ప్రవీణ్, పెళ్ళై ఓ పంచ వర్ష ప్రణాళిక దాటిన వాళ్ళంతా అల్లుళ్ళుగా తమ ఘనత నిలబెట్టుకున్నప్పుడుల్లా తమ తోటివారిని ఉడికించాలని ఇలాంటి విందులు చేయటం పరిపాటే! నిజానికి, ప్రవీణ్ మనసు మీద ఈ ప్రభావం పడే, అతని సంసార జీవనంలో ఈ మార్పు. "మన ప్రసాద్ కూడా పార్టీ ఇచ్చేస్తున్నాడు. అంటే ఇక మిగిలింది..." అంటున్న ప్రశాంత్ మాట పూర్తి కాకుండానే " వాడు ఓ ప్రేమమూర్తి. ఇల్లాలి మీద ఈగ వాలనిస్తాడా? ఆ సంగతి మనకెందుక్కానీ ముక్కు మూసుక్కూచున్న ప్రసాద్ మాత్రం మనతో కలిసిపోయాడు." అన్నాడు ప్రదీప్, "మీరంతా అలా అంటూ ఉండండి. నేనైతే మీ అందరినీ తలదన్నినంత ఘనుడైపోయి, మంచినీళ్ళతో సహా మామగారింటినించే రప్పించి, ఓ బ్రహ్మాండమైన పార్టీతో నా తడాఖా చూపిస్తా." ప్రసూన లొంగిరావటంతో ధీమాగా మాట ఇచ్చేశాడు. కాకపోతే, వాళ్ళందరూ తనని చేతకాని వాడుగా అంచనా వేస్తున్నారు. తనకేం మగతనం లేదా?

సూట్‌కేసుతో సహా వీధి గుమ్మంలో నిలబడింది. "బస్సెక్కటానికి మీ సాయమెందుకు? వెళ్ళగలను. వెళ్తున్నాను" తనని చూస్తూనే రొడ్డెక్కేసింది. " మరీ అలా వద్దులే. అనుకున్న టైముకి రాలేకపోయాను. బాగా చీకటి పడిందిగా! రేపు దిగబెడతాను." ప్రసూన భర్తతో పాటు లోనికొచ్చి కాఫీతో పాటు ఒక కవరు కూడా అందించింది.

ఉత్తరంలోని సారాంశం అతని మనసులో వెన్నెల వానలు కురిపించింది. తన ప్రాణానికి ప్రాణమైన అక్క, తన పాలిటి దేవతా మూర్తి అయిన అక్క, ఇన్నేళ్లుగా ఈ తరుణం కోసం ఎంత తపించిందని, ఈ వెలితి తన బ్రతుకంతా మిగిలి పోతుందని ఎంత బాధపడింది. ఎన్నో నోములు నోచిందీ, ఎన్నెన్ని దేవుళ్ళకు మొక్కుకుందీ, అన్నీ ఒక్కసారిగా ఫలించి, దాని ఒడి నిండ బోతుంది. పండంటి బిడ్డనెత్తుకుని అక్క తన కళ్ళముందు నిలిచిన అనుభూతి, ఆ అనుభూతి ప్రవీణ్‌ని ఒక్కసారిగా, అతని పసితనంలోకి లాక్కెళ్ళిపోయింది. తల్లి పొత్తిళ్ళ స్పర్శ పొందేలోగానే తనని ఈ ప్రపంచంలో పడేసి మరోలోకాలకి వెళ్ళిపోతే, పదేళ్లు నిండని లేత ప్రాయంలోనే ప్రభావతి అందర్నీ ఆశ్చర్య పరుస్తూ తనకి తల్లి లాలన అందించింది. అక్క ఒడిలోనే కళ్లు తెరిచాడు. ఆ చేతి గోరుముద్దలే తిన్నాడు, ఆ బంగారు చేయిపట్టుకునే తప్పటడుగులు వేసాడు, బడిలోకి, బ్రతుకులోకి పరుగులు తీసాడు. ఎవర్కైనా అక్కంటే అక్క కానీ తనకి అక్కంటే అమ్మ, తొలి గురువు, సర్వస్వం. "బొమ్మలతో ఆడుకోవలసిన వయసులోనే పెద్ద ఆరిందాలా తమ్ముణ్ని ఎంత ప్రేమగా పెంచుతున్నావే, నువ్వేగనక అత్తవారింటికి వెళ్ళి నీ కడుపున ఓ నలుసు పుడితే యశోదమ్మవో, కౌశల్యవో, అయిపోతావు. నీ పిల్లలు ఎంత అదృష్టవంతులో." బంధువులంతా, అక్కతో

పరిహాసాలాడేవారు. వాళ్ళ పరిహాసాలకు పరవసించిన అక్క పెళ్లై నాలుగేళ్లు గడిచేసరికి తనకి మాతృత్వం సిద్ధించలేదే అని మదన పడటం మొదలు పెట్టింది. బావ పెద్దగా పట్టించుకోకపోయినా అక్క అంతర్యం తెలిసిన తను ఆవేదన పడసాగడం. మరో నాలుగేళ్లు గడిచేసరికి అత్తవారు, చుట్టుపక్కల వాళ్ల గొఱ్ఱలివి, 'ఆకాశపంట' పుణ్యాత్ములకే దక్కుతుంది. నిన్ను కోడలిని చేసుకుని నీ పాప ఫలితం మేం అనుభవిస్తున్నాం, అంటుంటే పుండు మీద కారం జల్లినట్టు అయ్యింది అక్క పరిస్థితి. బావని ఒప్పించి వైద్య పరీక్షలన్నీ చేయించాడు తను, బావ వైపు బంధువులంతా తనని, మూర్ఖుడి కింద జమ కట్టినా బాధ పడలేదుకానీ అదృష్టం కలిసి వస్తేనే తప్ప ప్రభావతి కడుపుపండటం సాధ్యం కాదని డాక్టర్లు సారీ చెప్పేస్తే మాత్రం ప్రవీణ్ మనసుని దుఃఖం పెను మబ్బులా ఆవరించింది. విధి తమను వెక్కిరించిందా! నమ్ముకున్న దైవం మోసగించిందా! కలవర పడేవాడు. అక్కని ఓదార్చవలసింది పోయి తనే దిగులు పడిపోయేవాడు. తన జీవితం సజావుగా సాగిపోతున్నా, అక్కయ్య తలపుల్లో మెదిలే సరికి మనస్సు శూన్యమైపోతుంది. నిజానికి తనకి ఈ ప్రపంచంలో అక్క కన్న ఎక్కువ ఎవరూ లేరు అనే భావనతో అతని హృదయం ఎపుడూ నిండి ఉంటుంది. తనని ఎంత ప్రేమగా, మురిపెంగా సాకి తల్లిని మరిపించిన అక్క తల్లి అవలేకపోవటం తన బ్రతుకులో అన్నిటి కన్నా గొప్ప దురదృష్టం. అనుకునేవాడు. అందుకనే ఈ లేఖ ప్రవీణ్‌ని, ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. భార్యను కేక పెట్టాడు. ప్రసూనా! ఈ ఉత్తరం నువ్వు చదివినట్టు లేదు.". "ఎపుడూ మీ ఉత్తరాలు చింపి చదివే అలవాటు లేదుగా," భర్త ముఖంలోకి చూసింది. "అవునులే కాని దీన్ని అక్క వ్రాసింది ఇందులో అమృత వాక్యాలు ఉన్నాయి. అదే మా అక్క విశేషం వ్రాసింది ప్రసూ" అంటున్న భర్త ముఖంలో వెయివెలుగుల వెల్లువ. "నాకు చెప్పలేనంత ఆనందంగా ఉందండి, వదిన ఈ శుభ తరుణం కోసం ఎంత ఎదురుచూసిందో". " సరే ప్రసూన ఇంక అక్క బాధ్యత అంతా మనం చూసుకోవాలి, ఈ సమయంలో ఎంతో సుఖపెట్టాలి. మనస్సుకి ఎంత ఆహ్లాదం కలిగించాలనీ, ఎలా అయినా బావని ఒప్పించి అక్కని కొన్నాళ్ళు మన ఇంటికి తీసుకువస్తాను." " తప్పకుండా, వదిన కాలుకింద పెట్టకుండా చూసే పూచి నాదీ. మమతల మూర్తి అయిన వదినకి సపర్యలు చేయడంలో నాకు ఎంతో తృప్తి ఉంది. కళ్ళలో పెట్టి చూసుకుంటాను. కొంత కాలమేమిటి. ప్రసవం అయ్యేవరకు ప్రాణప్రదంగా పగలు, రాత్రి వదిన్ని అంటిపెట్టుకునే ఉంటాను. ముందు ఈ శుభ సమయంలో మీ నోరు తీపి చేస్తాను. " వంటింట్లోకి వెళ్ళిపోతున్న అర్ధాంగి చేయిపట్టి ఆపాడు. " తీపి కబుర్లు మొదలు పెట్టావా?" " లేదు శ్రీవారూ! మీ మనస్సు నాకు తెలియనిదా, దానికి రెండు అరలు. నా కర్తవ్యం విస్మరిస్తానని భయపడకండి. మీ ఆనందంలో పాలుపంచుకుంటున్నానంతే" "బ్రతికించావు కపట సేవలతో కల్లబొల్లి కబుర్లుతో తప్పించుకుంటావేమో అనుకున్నాలే. అక్క వచ్చేసరికి మన ఇల్లు అన్ని సౌకర్యాలతో ఉండాలి. దేనికీ తను వెతుకులాడ కూడదు. బావ ఎంత సుఖపెడుతున్నాడో, ఇంట్లో ఎన్ని అమర్చి పెట్టాడో మనం అలానే చూడాలి. నువ్వు మరింత తొందరగా నీ పని పూర్తి చేయవలసి ఉంటుంది.

ఇంటికి వెళ్ళటం కుదరక పోయినా ముందు అనుకున్నట్లు మీనాన్నకు ఉత్తరం వ్రాయి." అని ఆజ్ఞ జారీ చేసాడు.

అక్కని ఎంత తొందరగా చూస్తానా అన్న ఆరాటంతో ఆ రాత్రి నిద్ర కరువైంది అతనికి. ఎలా అయినా అక్క ఋణం తీర్చుకోవాలి. ఈ సమయంలోనే దాని ముద్దు మురిపాలు తీర్చాలా. తెల్లవారులోనే ప్రయాణమై అక్క దగ్గరకు వెళ్ళాడు. అక్కని తనతో పంపమనీ బావని అడిగాడు. "పై వారం నాకు కాంపు ఉంది. ప్రభని మీ ఊళ్ళో దిగబెట్టి అటునుంచి అలా వెడతాను అనేసాడు బావ." తను ఇంటికి వెళ్ళినా అవే తలపులు. అక్క తన ఇంటికి వస్తుంది. దానికి ఏ లోటు రానివ్వకూడదు. పువ్వుల్లో పెట్టి చూడాలి. రోజూ నాయంత్రాలు పార్కుకో, బీచీకో చల్లగాలిలో తిప్పి ఆనందంగా దానితో కాలం గడపాలి. "ఏమీ ఆలోచిస్తున్నారండీ." "ఉత్తరం వ్రాసి నిన్ననే నాన్నగారికి పోస్టు చేసాను. ఆ విషయంలో మీరు ధీమాగా ఉండచ్చు. ఆడపిల్లలని కన్నాక తల్లితండ్రులకు అగచాట్లు తప్పవు." "సరేలే ప్రసూనా! నేను ఆలోచిస్తున్నది మా అక్క గురించి, ఎల్లుండేగా అక్క వచ్చేది. నువ్వసలు ఏఏ వంటలు బాగా చేస్తావు".

"ఆర్నెల్లుగా తింటున్నారుగా." "అదే ప్రసూనా, అక్కయ్యకి ఎంతో రుచికరమైన వంటలు చేసి పెట్టాలి. ప్రేమగా లాలనగా చూసి ఇపుడు తనకి మనం పెద్దలం కావాలి." ప్రసూన నవ్వింది. "నాకూ అన్నీ తెలుసండీ. పిన్నిగారి దగ్గరకు వెళ్ళి పులుపు ఆవ పెట్టిన కూరలు, ఇంకా పెద్దవాళ్ళు చేసే ప్రత్యేకమైన పిండి వంటలు. అన్నీ నేర్చేసుకున్నా. తక్కినవన్నీ నేను బాగానే చేయగలను. మన ఆదరణకి వదిన మురిసిపోతుంది." అంది.

"అవును ప్రసూనా! ఇలాంటపుడు ఏదేదో తినాలని ఉంటుంది అంటారు కదూ. అందుకే నేను విజయనగరం మామిడి తాండ్ర, పలాస జీడి పప్పు రెడీ పెట్టాను. పనస పళ్ళు, అకాలంలో వచ్చే మామిడి పళ్ళు అన్ని ఎక్కడెక్కడ దొరుకుతాయో వాకబు చేసాను. ఆదిరావడమే ఆలస్యం అదేం కోరుకున్నా తీర్చేద్దాం." "ఓ అలాగే మీరంతలా చెప్పాలా. మీలో అర్ధ భాగాన్నీ కాదు. మీ ముచ్చట చూస్తుంటే సంబరంగా ఉంది నాకు." చిన్న పిల్లవాడిలా లిస్టు వల్లిస్తున్న భర్తను చిలిపిగా చూస్తూ అంది.

* * *

"ప్రసూనా! అక్క ఏం చేస్తోంది? ఈ రెండు రోజులలో ఏం చేసి పెట్టావు ? ప్రదీప్ కలకత్తా వెళుతుంటే, అక్కడి స్పెషల్ రసగుల్లా తీసుకురమ్మని చెప్పాను. నిన్నవాడు తెచ్చి ఉండాలే!"

"తెచ్చారు మహాప్రభూ! అయినా వదిన ఊరికే మొహమాట పడిపోతున్నారు! ఏదిచ్చినా వద్దంటుంటే ఇంకేంపెట్టేది?"

"ఏడిసావ్! తనేం ఇది కావాలి, అది కావాలి అని అడిగి తింటుందా! నువ్వే దగ్గరుండి కొసరి కొసరి తినిపించాలి. దారిలో కన్పిస్తే ముడ్వంకాయలు పట్టుకొచ్చాను. ఉల్లికారం పెట్టి

పండు అన్నట్లు ఉల్లికాడల పులుసంటే అక్కకి ఎంతో ఇష్టం. తొందరగా వంట కానీయి అక్కతో కబుర్లు చెప్తాను.''

ప్రభావతి రాగానే కాంపుకెళ్ళాల్సి వచ్చినందుకు నొచ్చుకున్నాడు ప్రవీణ్!

''సారీనే అక్కా! నువ్వు రాగానే దిక్కు మాలిన కాంపొకటీ! తప్పించుకొందామని చూసాను కానీ... మా బాస్ ఓ చండశాసనుడులే! అతనికి ఏ చిన్న విషయంలో ఎదురు చెప్పినా ప్రమోషన్లు ఆపేస్తాడు''. అక్క ప్రక్కనే మంచం మీద కూర్చున్నాడు.

''దానికేముంది? నేనేం పరాయిదాన్నా. నాకీ.. మర్యాదలేవిటి?''

''అలా అనికాదే! ఇన్నాళ్ళకి నన్ను మావయ్యను చేస్తున్నావు. ఇప్పుడు నిన్నెలా చూడాలి నేనా... ఊళ్ళోలేను. వేళకి మందులేసుకున్నావా? ససేమిరా! ఏమీ తిననంటున్నావుట!'' ''అక్క చేతిని మృదువుగా తన చేతిలోకి తీసుకున్నాడు.

''అవునురా! అన్నీ నాముందు పెట్టి తిని తీరాలని పట్టు పడితే ఎలా మరి? ''ఏంటోనే తాజా కూరలు నాలుగు రకాల పళ్ళు తీసుకొద్దామంటే ఫ్రిజ్జా! నీకు కాస్త ఎంటర్‌టెయిన్‌మెంట్. ఈ బోడి రికర్డార్ తప్ప. టి.వి నా? సంసారం చేస్తున్నా నాదో సన్యాసిగాడి కొంప. నీ మరదలు మా ఇంటిని ఓ ముష్టి కొంపలా ఉంచింది. చూస్తున్నావుగా!''

బోర్నవిటా కప్పులతో వచ్చిన ప్రసూన గతుక్కుమంది. టేబుల్ పైన పెట్టేసి గిర్రున వంటింట్లోకి వెళ్ళి పోయింది. ఆ కళ్ళలో గిర్రున్న నీళ్ళు తిరగటం గమనించింది ప్రభావతి.

''ఏవిటిరా! అలా మాట్లాడతావ్! తథాస్తు దేవతలుంటారు. అప్రాచ్యపు మాటలు నోటివెంట వస్తే తథాస్తు అనేయగలరు జాగ్రత్త.

నువ్వు మనసులో ఏవో పెట్టుకున్నావ్?'' '' అదేం కాదే! నీ మరదలు దరిద్రాన్ని వెంటేసుకొచ్చింది. మరేం చేయమంటావ్?''

తమ్ముని మనసు పూర్తిగా అవగతమైపోయింది. ఎంతో సుతిమెత్తని స్వభావామని ఎవరిని రవ్వంతైనా నొప్పించడని . ఇన్నాళ్ళు అనుకుంది. మరదలు చెప్పినా నమ్మశక్యం కాలేదు. ఇలాంటి పురుష పుంగవుల్లో వీడు ఒకడా? తన పెంపకంలోనే ఈ లోపం ఉందా? నిట్టూర్చింది. పెడబుద్ధులున్న ఏ పది మందినో చూసి వీడు ఇలా తయారయ్యాడు. వీడిలో మరుగున పడిపోయిన అసలు మనిషిని మేల్కొలపాలి. ప్రభావతి ఊహా పథంలో తటిల్లత తళుక్కుమంది. అదునెరిగి జల్లిన విత్తులు మంచి పంటనిస్తాయి. సకాలంలో హృదయంలో నాటిన మానవత్వపు మొలకలూ అంతే!

''ఏమాలోచిస్తున్నావే. మా గొడవలు ఎప్పుడూ ఉండేవే. పక్కపపెట్టు. ఇప్పటికే నేననుకున్నట్లు నీతో గడపలేకపోతున్నాను. ఈ చల్లని సాయం వేళ అలా తిరిగొద్దాం. అది వంట పనిలో ఉంది కదా నువ్వు బయలుదేరు.''

ప్రభావతి ఫక్కున నవ్వింది. " ఏమిటిరా నీ వాలకం? మరీ ఇంత ఇదై పోతున్నావ్."

"అలా అని కాదే అక్కాయి. అసలు నీ మనసులో ఉన్న కోరిక ఏదైనా చెప్పు తీర్చి, నా ఋణం తీర్చుకుంటాను. నిజానికి నాకే కోరికలూ లేవురా. జీవితాంతం తృప్తినిచ్చే కోరిక నాకొకటుంది."

ఏమిటన్నట్లు చూస్తున్న తమ్మునితో -

"చెబుతారా! తీరుస్తానని మాట ఇవ్వాలి." ప్రవీణ్ చుట్టూ చెయ్యి వేసి అంది.

"అదేమిటే మళ్లీ మాట దాటట మా. నీ చేతుల్లో పెరిగిన వాణ్ణి. నీ ప్రేమతో ఇంతటివాణ్ణి చేసావ్! నీ కోసం కొండ మీద కోతినైన తీసుకొస్తాను."

"అఖ్ఖరలేదు కానీ నీలో కోతిని తరిమేయి." విస్తుబోతున్న తమ్ముడి ముఖంలోకి చూస్తూ! "అవునురా! పులిని చూసి నక్కవాత అన్నట్టు, వెంపర్లాడుతున్నావ్‌కానీ. ఈ వక్రపు ఆలోచనలు నీవి కావు. నువ్వు నువ్వుగా జీవించాలన్నదే నా కోరిక. నా మరదలు మల్లెపువ్వురా! దాని మనస్సుని నలిపి పారేయకు, కష్టపెట్టి ఆకళ్ళల్లో నీళ్లు రానీయకు, నీ కాపురం కలకళలాడాలని, అర్ధాంగి అంటే నీ అర్ధ భాగం అని, ఇల్లాలు ఇంటి దీపం అని నువ్వు గుర్తించ గలగాలన్నదే ఈ అక్క కోరిక. ఈ ఇంటి ఆడపడుచుగా నిన్ను అర్థిస్తున్నాను. " ప్రభావతి కళ్ళలో రెండు కన్నీటి బొట్లు.

"అంత మాట ఎందుకే. అర్థించటం కాదు. నన్ను సాసించే హక్కుంది నీకు. ఒక్క మాటతో నా కళ్ళకు కట్టిన పొరలు సర్జరీ చేసి పారేసావ్. ఇక ఎప్పుడూ నీమరదలిని వేధించను. నువ్వు కోరుకున్నట్టే మా కాపురం సాగిపోతుంది." అంటున్న తమ్ముని మాటలలో నిజాయితీకి తృప్తిగా ఊపిరి పీల్చుకుంది ప్రభావతి.

*28 -12 -2001 ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి ప్రసారం* ❑